
ఈనాడు ఆదిలాబాద్
శుక్రవారం సెప్టెంబరు 27, 2024



అందాల సలాయిగూడ.. చూడ కనువిందోయి!

ఆదిలాబాద్ జిల్లా అనగానే ప్రకృతి అందాలకు మారుపేరుగా నిలుస్తుంది. అడవి మధ్యలో పల్లెలు.. పచ్చని పొలాలతో ఆహ్లాదం ఉట్టిపడుతుంది. ప్రకృతి ఒడిలో ఆ ఊరు పరవశించిపోతోంది. చుట్టూ పచ్చదనంతో కనువిందు చేస్తున్న అడవి మధ్యలోని ఆ గ్రామమే ఆదిలాబాద్ గ్రామీణ మండలం సలాయిగూడ.

- ఈనాడు, ఆదిలాబాద్

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం

జిల్లాలో పోలీసు యాక్ట్ అమలు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో పోలీసు చట్టం 30 అమలులో ఉందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్పీ, ఆపై స్థాయి అధికారి నుంచి సభలు, సమావేశాలు, ఊరేగింపులకు అనుమతులు తీసుకోకుండా నిర్వహిస్తే మాత్రం బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదిలాబాద్‌లోనూ 'పట్టణాభివృద్ధి సంస్థ'

- పరిధిలోకి రానున్న చుట్టుపక్కల గ్రామాలు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ అర్బన్

అభివృద్ధి చెందిన పట్టణ ప్రాంతాల్లో ఇది వరకే రూపుదిద్దుకున్న పట్టణాభివృద్ధి సంస్థ తరహాలో ఆదిలాబాద్‌లోనూ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. జిల్లా కేంద్రం చుట్టుపక్కల గ్రామాలను మహర్దశ కరిగించేలా, పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం ఈ సంస్థ నెలకొల్పేలా ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండటం ప్రాధాన్యంగా మారింది.



ఆదిలాబాద్ చుట్టుపక్కల గ్రామాల వివరాలను డీపీఓ శ్రీలత నుంచి సేకరిస్తున్న ఇన్‌ఛార్జి డీటీసీపీఓ సుమలత

జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను కలిపి పట్టణ ప్రాంత అభివృద్ధి సంస్థ ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ఇప్పటికే వరంగల్‌కు కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), నిజామాబాద్‌కు నుడా మాదిరిగా ఆదిలాబాద్‌లోనూ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చుట్టుపక్కల గ్రామాలను సంస్థ పరిధిలోకి తీసుకొస్తారు. ఎంత దూరంలో గ్రామం ఉండాలనే కొలమానం లేకపోవడంతో ఏయే గ్రామాలు దీని పరిధిలోకి వస్తాయనేది చెప్పలేమని అధికారుల వాదన. కరీంనగర్, నిజామాబాద్‌లో దాదాపు 20 కిలోమీటర్ల దూరం వరకు గ్రామాలను కలిపి సంస్థ ఏర్పాటు చేయడంతో ఇక్కడ సైతం ఆ రీతిలోనే స్పందిస్తారా అనేది చూడాల్సి ఉంది.

ప్రయోజనమేమిటి?

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటైతే దీని కోసం ప్రత్యేకంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక ఛైర్మన్‌ను నామినేటెడ్ పద్ధతిన నియమిస్తారు. పురపాలక కమిషనర్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ముఖ్య ప్రణాళిక అధికారిని నియమిస్తారు. పట్టణ ప్రణాళిక విభాగం, డీటీసీపీ సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఈ సంస్థకు నేరుగా ప్రభుత్వం నుంచే అభివృద్ధి నిధులు మంజూరవుతాయి. సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాలతో పాటు ఆదిలాబాద్ పట్టణంలోనూ ఈ నిధులను వెచ్చించేందుకు అవకాశం ఉంటుంది. మున్సిపాలిటీలో అయితే పాలకవర్గం అనుసంధానంగా పని చేస్తుంది. రహదారుల నిర్మాణం, కాలువలు, గ్రామ రూపురేఖలు మార్చేందుకు డిజైన్ల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్, ఇతర వసతుల కోసం నిధుల ఈ సంస్థ వెచ్చిస్తుంది. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు జీ+2 వరకు స్థానికంగా అనుమతి ఇస్తోంది. సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో జీ+5 నిర్మాణాల వరకు అనుమతులు ఇచ్చే అధికారం సంస్థకు ఉంటుంది. పరిశ్రమల ఏర్పాటు, లేఅవుట్ల అనుమతులు సైతం సంస్థ నుంచే మంజూరవుతాయి. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఈ సంస్థ కార్యకలాపాలు కొనసాగుతాయి. సంస్థ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో యథావిధిగా కార్యదర్శుల పాలన కొనసాగుతుంది. ఇతర అభివృద్ధి ప్రణాళికలు, నిర్మాణ అనుమతులకు మాత్రం సంస్థ అజమాయిషీ ఉండనుంది.

అద్భుతంగా మారనున్న ఏజెన్సీ ప్రాంతం

ఆదిలాబాద్ చుట్టుపక్కల ఏజెన్సీ ప్రాంతం ఉండటం ఈ సంస్థకు కొంత ఇబ్బందిగా మారనుంది. ఏజెన్సీ గ్రామాలను మినహాయించి సంస్థను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉండటంతో చుట్టుపక్కల చాలా వరకు గ్రామాలు పట్టణాభివృద్ధి సంస్థకు దూరం కానున్నాయి. ఆదిలాబాద్‌కు ఆనుకుని తంతోలి నుంచి ఏజెన్సీ ప్రాంతం ప్రారంభం కావడంతో ఆ వైపు గ్రామాల జోలికి వెళ్లే అవకాశం లేదు. మరోవైపు యాపల్‌గూడ వైపు సైతం ఏజెన్సీ ప్రాంతం ఉండటంతో అటు వైపు సంస్థ పరిధి వ్యాపించే అవకాశం లేదు. ఆదిలాబాద్ గ్రామీణం, జైనథ్, బీంపూర్, తలమడుగు, తాంసి మండలాల పరిధిలోకి వచ్చే గ్రామాలు పట్టణానికి సమీపంలో ఉండటంతో చాలా వరకు గ్రామాలు సంస్థ పరిధిలో కలిసే అవకాశముందని అంచనా వేస్తున్నారు. కాకపోతే ప్రభుత్వం ఆమోదిస్తేనే ఈ సంస్థ ఏర్పాటవుతుంది.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

- సుమలత, ఇన్‌ఛార్జి డీటీసీపీఓ

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి, పురపాలక అధికారులతో కలిసి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, బీసీ సంక్షేమ అధికారి రాజలింగు, తదితరులు

ఐలమ్మ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని గురువారం రిమ్స్ ఎదుట ఆమె విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు పోరాడిన మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. రజకులకు ప్రభుత్వం అందించే పథకాలను వర్తింపజేస్తామని పేర్కొన్నారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగు, బీసీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, రజక సంఘం పట్టణాధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు తరలించరే!

- తప్పిదమంతా రాష్ట్రస్థాయిలో

ఈటీవీ-ఆదిలాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేసే మందుల వినియోగం అస్తవ్యస్తంగా తయారవుతోంది. గడువు మీరిన మందులను - గడువున్న వాటిని ఒకే చోట నిల్వ ఉంచే విధానం అమలవుతోంది. ఫలితంగా ఎక్కడైనా చిన్న తప్పిదం జరిగితే రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వినియోగించే మందులు, ఇంజెక్షన్లు, సహా వైద్యానికి సంబంధించిన అన్ని రకాల సామగ్రిని తెలంగాణ వైద్య, మౌలిక వసతుల సంస్థ(మెడికల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ - టీజీఎంఎస్ఐడీసీ) సరఫరా చేస్తోంది. పాత జిల్లా కేంద్రాల్లోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్(సీడీసీ) ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు పంపిణీ జరుగుతోంది. గడువు మీరిన మందులు, ఇంజెక్షన్లను ఏడాదికేడాది వెనక్కి తీసుకెళ్లాలనే నిబంధనలు రాష్ట్రస్థాయిలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా మూడేళ్లుగా అమలు కావటం లేదు. ఫలితంగా కాలం చెల్లిన మందుల నిల్వలు సీడీసీల్లో పేరుకుపోవటంతో గడువు ఉన్న మందుల్లో కలిసిపోయే ప్రమాదం ఏర్పడుతోంది.



కీలకం ఇదీ

ఆదిలాబాద్‌లోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్(సీడీసీ) పాత్ర అత్యంత కీలకం. హైదరాబాద్ నుంచి వచ్చే మందులను రోగుల తాకిడి, వినియోగం ఆధారంగా ఉమ్మడి జిల్లాలోని 104 ఆసుపత్రులకు సీడీసీ సరఫరా చేస్తోంది. మందుల వినియోగంపై హైదరాబాద్‌లోని అధికార యంత్రాంగం ఆన్‌లైన్లో తెలుసుకునే ప్రత్యేక వ్యవస్థ ఉంది. కానీ అధికార యంత్రాంగం పట్టించుకోక ఏ మందు గడువు ఎప్పుడు అయిపోయిందో? ఏ మందులను వెనక్కి తీసుకురావాలో? తెలియని అనిశ్చితి నెలకొంది. గడువు మీరిన మందులను 2021లో వెనక్కి తీసుకెళ్లారు. ఆ తరువాత తీసుకెళ్లలేదు. దాంతో ఆ నిల్వలన్నీ సీడీసీలో పేరుకుపోయి సాధారణ మందుల్లో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉంది. దాదాపుగా 272 రకాల మందుల్లో 150కిపైగా రకాల మందుల గడువు ముగిసిపోగా మరో 120 రకాల గడువు వచ్చే మూడు నెలల్లో ముగియనుంది.

ఇలా చేయాలి..

గడువు మీరిన మందులను నిల్వ ఉంచకుండా ఏడాదిలోగా తరలించాలి. ఒక కంపెనీని టెండర్ ద్వారా ఎంపిక చేసి గడువు తీరిన మందులను తరలించే పద్ధతి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన వాటిని మహబూబ్‌నగర్‌లో ఉన్న ప్రత్యేక కేంద్రంలో ధ్వంసం చేయాలి. దానికి సంబంధించిన బాధ్యత అంతా ఆ కంపెనీయే చూడాల్సి ఉంది. కానీ మూడేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఫలితంగా మందుల నిల్వలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మూడు నెలల్లోగా గడువు ముగిసే మందులను ఆసుపత్రులకు సరఫరా చేయరాదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఈ ప్రక్రియ ప్రహసనంగా మారింది. హైదరాబాద్‌లోని అధికారులు టెండర్ నిర్వహించక ఈ పరిస్థితి తలెత్తింది.

సీడీసీ నుంచి మందులు సరఫరా అయ్యే ప్రభుత్వ ఆసుపత్రుల వివరాలు..

జిల్లా	వైద్య	ప్రాంతీయ	ప్రసూతి	సామాజిక	ప్రాథమిక	పట్టణ
	కళాశాలలు			ఆసుపత్రులు		
ఆదిలాబాద్	01	–	–	03	21	05
ఆసిఫాబాద్	01	–	–	06	15	02
మంచిర్యాల	01	01	–	02	17	04
నిర్మల్	01	01	01	03	16	03

అటకెక్కిన ఆహార పట్టిక!


ఈనాడు, ఆసిఫాబాద్

గిరిజన వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆహార పట్టిక ప్రకారం గుడ్లు, పాలు, చికెన్, రాగిజావ, అరటి పండ్లు అందించాలి. వీటి కోసం ఏటా టెండర్లు నిర్వహిస్తారు. గుత్తేదారులు బిల్లులు రావడం లేదంటూ చేతులెత్తేస్తున్నారు. రాకపోతే సంబంధిత ప్రధానోపాధ్యాయులే (హెచ్‌ఎం) సరకులు సమకూర్చుకోవాలని అధికారులు చెబుతున్నా.. ఆర్థిక భారమని వీరూ పట్టించుకోవడం లేదు. విద్యార్థులకు కేవలం పప్పు లేదా ఒక కూరతో సరిపెడుతున్నారు. కొన్ని వసతిగృహాల్లో అంతంతమాత్రంగానే మెనూ అమలవుతోంది. పెండింగ్ బిల్లులు విడుదల చేసి, విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చక్కని విద్యతోపాటు కడుపు నిండా భోజనం అందుతుందనే ఉద్దేశంతో తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చేర్చుతుంటారు తల్లిదండ్రులు. అయితే ఆహార పట్టిక సరిగ్గా అమలుకాక పిల్లల చదువుపై ప్రభావం పడుతోంది. గుత్తేదారులు సరకులు సక్రమంగా సరఫరా చేయకపోవడమే కారణం. ఉమ్మడి జిల్లాలోని గిరిజన వసతిగృహాల్లో ఈ సమస్య ఉత్పన్నమవుతోంది.



వాంకిడి గిరిజన వసతిగృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు



- వసతిగృహాలకు సరఫరా కాని సరకులు
- విద్యార్థులకు అందని పోషకాహారం



పప్పుతోనే విద్యార్థులకు భోజనం

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 530 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ కోడిగుడ్ల సరఫరా లేక పప్పుతోనే సరిపెడుతున్నారు. మండలంలోని అన్ని ఆశ్రమ పాఠశాలలకు గుడ్లు, అరటిపండ్లు రావడం లేదు.

ఏళ్లుగా ఇద్దరికే టెండర్!

ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత ఐటీడీఏ అధికారులు సరకుల సరఫరా కోసం టెండర్లు నిర్వహిస్తుంటారు. కొన్నేళ్లుగా ఆదిలాబాద్, ఉట్నూరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తులకు మాత్రమే టెండర్ వస్తుండటం గమనార్హం. అంతర్జాలంలో అంతా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఏళ్ల తరబడి వీరిద్దరికే ఎలా టెండర్ దక్కుతుందనేది అంతుపట్టని విషయం. పోనీ సరకులు సక్రమంగా సరఫరా చేస్తారా అంటే అదీ ఉండటం లేదు. మరోవైపు కొత్త వారు టెండర్లు వేయకుండా, వారికి అవకాశం రాకుండా చేస్తున్నారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి.

రూ.1.50 కోట్ల బిల్లుల పెండింగ్!

జూన్ నుంచి కొంత కాలంపాటు పాలు, చికెన్, గుడ్లు, అరటిపండ్లు సరఫరా చేసిన గుత్తేదారులు.. నెల రోజుల నుంచి అనేక వసతిగృహాలకు అందించడం లేదని సమాచారం. కొన్నిచోట్ల ప్రధానోపాధ్యాయులు తెచ్చి పెడుతున్నా నిత్యం రూ. 10-20 వేలు ఖర్చు పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు జిల్లాల పరిధిలో రూ. 1.50 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. పదుల సంఖ్యలో వసతిగృహాలకు నాలుగు నెలల నుంచి వీటి సరఫరా ఊసేలేకపోవడం గిరిజన సంక్షేమాధికారుల పనితీరును తేటతెల్లం చేస్తోంది.

పప్పన్నంతో సరి

విద్యార్థులకు నిత్యం ఉదయం పాలు, రాగిమాల్ట్ ఇవ్వాలి. వారంలో నాలుగు రోజులు గుడ్లు, నాలుగు రోజులు అరటిపండ్లు, ఒకసారి చికెన్ వండి పెట్టాల్సి ఉంటుంది. నిత్యం వివిధ కూరగాయలతో చేసిన కూర, పప్పు, అన్నం అందించాలి. ఉమ్మడి జిల్లాలో ఆహార పట్టిక (మెనూ) ఎక్కడా అమలు కావడం లేదు. కేవలం పప్పు, అన్నంతోనే విద్యార్థులు సరిపెట్టుకుంటున్నారు.

పర్యవేక్షిస్తాం - రమాదేవి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి

గుత్తేదారులు సరకులు సరఫరా చేయలేకపోతే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే వీటిని తెప్పించాలి. వీరికి బిల్లులు చెల్లిస్తాం. ఆహారపట్టిక తప్పనిసరిగా గిరిజన ఆశ్రమ వసతిగృహాల్లో అమలు చేసేలా పర్యవేక్షిస్తాం.



నృత్యాల జోరు.. కేరింతల హోరు

యువతీ, యువకుల నృత్యాలు.. సహచరుల కేరింతలతో ప్రభుత్వ సైన్సు డిగ్రీ కళాశాల హోరెత్తింది. గురువారం ఆ కళాశాల స్వాగతోత్సవం నిర్వహించారు. సీనియర్లు ఆట..పాటలతో అదరగొట్టారు. జూనియర్లు సైతం ఆయా ప్రదర్శనలతో మైమరిపించారు. ప్రిన్సిపల్ డా.జె.సంగీత, వైస్ ప్రిన్సిపల్ జగ్‌రాం అంతర్వేది, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : డీఎస్సీ -2008లో ఎంపికైన బీఎడ్ అభ్యర్థులకు ఆదిలాబాద్ విద్యాశాఖ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. అక్టోబర్ అయిదో తేదీ వరకు ఈ పరిశీలన కొనసాగుతుందని డీఈవో ప్రణీత తెలిపారు. మొత్తం 135 మంది పేర్లను వారి హాల్‌టికెట్ల నెంబర్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. వెంట అన్ని విద్యార్హత పత్రాలతో పాటు కమ్యూనిటీ, ఆధార్, హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో పాటు నిర్ణీత డేటా వెరిఫికేషన్ దరఖాస్తు పూరించి ఇవ్వాలని సూచించారు.

గోప్యంగా నియామకాలు

బజార్‌హత్నూర్ ఆదర్శ పాఠశాలలో ఇదీ పరిస్థితి



బజార్‌హత్నూర్ ఆదర్శ పాఠశాల

బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే: ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్ల కిందట స్థాపించిన ఆదర్శ పాఠశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బందిని ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసింది. జిల్లాలోని 6 పాఠశాలల్లో ఇంత వరకు పని చేసిన సిబ్బంది మొత్తం బదిలీ కాగా.. వారి స్థానాల్లో కొత్త వారిని నియమించింది. బజార్‌హత్నూర్ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్‌తో కలిపి మొత్తం 21 మంది సిబ్బంది పని చేయగా.. ఇటీవల బదిలీల్లో 15 మంది ఇక్కడి నుంచి వెళ్లారు. కేవలం ముగ్గురు మాత్రమే ఇక్కడికి రావడంతో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రకటన ఇచ్చి డెమోలో ప్రతిభ చూపిన వారిని సంబంధిత సబ్జెక్టులకు హెచ్‌బీటీలుగా(గంటల ప్రాతిపదికన పనిచేసే ఉపాధ్యాయులు) నియమించాల్సి ఉంది. కానీ కామర్స్ సబ్జెక్టుకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి మిగతా సబ్జెక్టులకు ఇతర ఆదర్శ పాఠశాలల్లో పని చేసిన హెచ్‌బీటీలను నేరుగా నియమించుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయమై ప్రిన్సిపల్ సంగీతను 'న్యూస్‌టుడే' సంప్రదించగా తమకు ఏడీ నుంచి అలా తీసుకోమని వాట్సాప్ ద్వారా ఆదేశాలు వచ్చాయని.. సమావేశంలో మౌఖికంగా తెలిపారని, వాట్సాప్ పీడీఎఫ్ ద్వారా పంపారని వేర్వేరు సమాధానాలు ఇచ్చారు. జైనథ్ ఆదర్శ పాఠశాలలో ప్రకటన జారీ చేసి డెమోల ద్వారా ఎంపికలు చేపడుతుండగా బజార్‌హత్నూర్‌లో మాత్రం ఈ పరిస్థితి గందరగోళాన్ని సృష్టిస్తోంది. పాలనాధికారి స్పందించి విచారణ చేపట్టాలని నిరుద్యోగులు కోరుతున్నారు.



పొన్నారిలో పగిలిన మిషన్ భగీరథ పైపులైన్



గుంతలో మునిగిన ద్విచక్ర వాహనాన్ని బయటకు తీస్తున్న గ్రామస్థులు

పైపులైన్ పగిలింది.. వాహనం మునిగింది

తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు తాగు నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ గురువారం సాయంత్రం తాంసి మండలం పొన్నారిలో పగిలిపోయింది. నీరంతా పైకి ఎగిసిపడుతూ పెద్ద గుంత ఏర్పడింది. రైతు ఆశన్న ద్విచక్ర వాహనం అదే స్థలంలో నిలిపి ఉండటంతో గుంతలోని నీటిలో మునిగిపోయింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గ్రామస్థులు తాడు కట్టి అతికష్టం మీద వాహనాన్ని బయటకు తీశారు. సమీప హోటల్‌లోకి నీరు చేరడంతో ఫ్రిజ్ ఇతర వస్తువులు దెబ్బతిన్నాయి. **- న్యూస్‌టుడే, తాంసి**

ఉత్సాహంగా జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం: జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం నిర్వహించిన అండర్-17 బాలికల జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లావ్యాప్తంగా 11 పాఠశాలల జట్లు ఈ పోటీల్లో తలపడ్డాయి. ముఖ్య అతిథిగా డీఈఓ ప్రణీత హాజరై మాట్లాడారు. పోటీలను ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు, పీడీలు హరిచరణ్, మహేశ్, నాందేవ్, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అప్రమత్తతే.. పిడుగుపాటు నుంచి రక్షణ!

● ఇటీవల వరుస మరణాలు

కెరమెరి, ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే:

ఏటా వానకాలంలో పిడుగుపాట్లకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో మనుషులు, జీవాలు మృత్యువాతపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వానకాలం చివరి దశలో ఉన్న ఈ సమయంలో వరుస మరణాలు ఆందోళనకు కారణమవుతోంది. సాంకేతికత ఉపయోగించి ప్రజలకు ముఖ్యంగా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. అడవుల జిల్లాగా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్‌లో సాధారణంగా ఎత్తైన ప్రాంతాలు, చెట్లు ఎక్కువగా ఉండడంతో వర్షపాతం అధికంగా ఉంటుంది. దీనికితోడు పిడుగుల సమస్య కూడా ఎక్కువే.

ఇటీవల ఉమ్మడి జిల్లాలో జరిగిన ఘటనలు

కళ్లెదుటే భర్త మృత్యువాత


గత నెల 18న పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన సిడాం శ్రీనివాస్.. భార్య కాంత కూలీలతో వరి పొలంలో ఎరువులు వేస్తుండగా భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. కాంతకు స్వల్ప గాయాలయ్యాయి. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

- ఈ నెల 21న కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌లో ఎద్దుపై పిడుగుపడి మృతి చెందింది. సమీపంలో ఉన్న తాక్రె గోవిందు, నీలాబాయి దంపతులు పిడుగుపాటుకు గురై గాయాలపాలయ్యారు.
- ఈ నెల 22న మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన గోలెం పోషక్క తన వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తుండగా.. పిడుగుపడి మృతిచెందింది.
- ఈ నెల 22న ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన రాఠోడ్ అవినాష్. తన చేనులో పశువుల కోసం గడ్డి కోస్తుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

పిడుగు అంటే..

వానలు పడే సమయంలో మబ్బుల నుంచి అత్యంత శక్తివంతమైన విద్యుత్తు విడుదల అవుతుంది. అది భూమికి చేరినపుడు దాన్ని పిడుగు అంటారు. ఆ సమయంలో భారీ ఉరుములు, మెరుపులు వస్తాయి. పిడుగుతో చనిపోయిన ప్రతి పది మందిలో ఆరుగురు చెట్ల కింద నిలబడిన వారే.

ఈ జాగ్రత్తలు పాటిస్తే..




- పంట చేన్లలో పనిచేసే సమయంలో వర్షం పడితే రైతులు ఏదో ఒక చెట్టు కిందికి వెళ్తుంటారు. గాలి, ఉరుములు, మెరుపులు ఉంటే పిడుగులు పడేందుకు అవకాశం ఎక్కువ.



- సాధారణంగా ఎత్తైన ప్రాంతాల్లో లేదా చెట్లపై ఎక్కువగా పడే అవకాశం ఉండటంతో ఆయా ప్రాంతాల్లో ఉండకూడదు.
- కేబుల్ టీవీ, కంప్యూటర్లు వంటి విద్యుత్తు ఉపకరణాలు ఆపేసి కనెక్షన్లు తొలగించాలి.
- విద్యుత్తును గ్రహించే వస్తువులకు దూరంగా ఉండాలి. నేల మీద నిటారుగా నిల్చొని ఉండొద్దు. భూమిపై పడుకోవాలి లేదా కూర్చోవాలి.
- పిడుగుపాటుకు గురైన వ్యక్తి స్పృహ కోల్పోతాడు. ఇలాంటి వారికి ప్రాథమిక చికిత్స చేయడం కూడా ముఖ్యం. బాధితులను వెంటనే ఆసుపత్రికి తరలించాలి.
- ఈ సమయంలో చరవాణి వాడకూడదు.

ముందుగా తెలుసుకోవడం ఎలా?



పిడుగుల నుంచి ముందే హెచ్చరించేందుకు కేంద్ర ప్రభుత్వం **'దామిని'** యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. రానున్న 15 నిమిషాల్లో మనం ఉండే ప్రదేశంలో పిడుగు పడుతుందో లేదో దీని ద్వారా తెలుసుకోవచ్చు. కేంద్ర భూ విజ్ఞానశాఖ కింద పనిచేసే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ 2020లో ఈ యాప్ రూపొందించారు. వ్యక్తుల జీపీఎస్ లొకేషన్ ఆధారంగా 20-30 కి.మీ. పరిధిలో పిడుగుల నుంచి యాప్ ముందుగానే హెచ్చరిస్తుంది. ప్లేస్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మోహన్‌దాస్ తెలిపారు.

నష్టపరిహారం ఉంది..



పిడుగుపాటుతో మృతి చెందితే కేంద్ర ప్రభుత్వం రూ.4 లక్షల నష్టపరిహారం ఇస్తుంది. గత భారాస ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ జీఓకు అదనంగా మరో రూ.2 లక్షలు కలిపి రూ.6 లక్షలు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. రైతుబీమా పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఎవరైనా పిడుగుపాటుతో చనిపోతే దీని కింద రూ.5 లక్షలు మంజూరు చేశారు. కానీ భూములు లేని వారిని పట్టించుకోకపోవడంతో ఉమ్మడి జిల్లా మొత్తంలో ఇప్పటి వరకు 42 మంది పైగా పిడుగుపాటుకు గురై మృతి చెందినా పరిహారం రాని పరిస్థితి. జీఓను సవరించి, కేంద్ర నుంచి వచ్చే పరిహారం కోసం ప్రయత్నిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు బి.గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.


ప్రభుత్వం ఆదుకోవాలి

- సుమిత్ర బాయి, కెరమెరి



ఇద్దరు పిల్లలతో కనిపిస్తున్న ఈమె పేరు చౌదరి సుమిత్ర బాయి. భర్త చౌదరి రమేశ్ ఆగస్టు 16న వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో పిడుగుపాటుకు గురై మృత్యువాతపడ్డారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఇద్దరు చిన్నారులతో ఒంటరిగా మిగిలారు. ఎలాంటి వ్యవసాయ భూమి లేకపోవడంతో జీవితం అగమ్యగోచరంగా మారిందని వాపోతున్నారు.

పర్యాటకం.. మెరుగుపరిస్తే ప్రయోజనం



● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

న్యూస్‌టుడే, కడెం: సహజసిద్ధమైన అందాలతో ఆకట్టుకునే కడెం జలాశయానికి నాలుగేళ్లుగా సందర్శకుల తాకిడి ఎక్కువైంది. ఎత్తైన సహ్యాద్రి కొండలను ఆనుకుని కనువిందు చేసే సుందర దృశ్యాలను ఇముడ్చుకుని ఉన్న కడెం పర్యాటకులకు మానసికోల్లాసాన్ని అందిస్తుందనడంలో సందేహం లేదు. అయితే ఇక్కడకు వచ్చే పర్యాటకులకు సరైన సదుపాయాలు లేక, ప్రశాంత వాతావరణంలో కొద్దిసేపు సేద తీరడానికి వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. సందర్శకులు జలాశయంలో విహరించేందుకు పర్యాటకశాఖ ఏర్పాటు చేసిన పడవల్లో స్పీడ్ బోటు మోటారు చెడిపోవడంతో దాన్ని పక్కన పడేశారు. పెద్ద బోటులోకి ఎక్కేందుకు ఉపకరించే స్టాండు(జెట్టి) పట్టు రక్షణ లేక ప్రమాదకరంగా ఉంది. ఈ బోట్లను మార్చి కొత్త పడవలు, స్టాండు తెప్పిస్తామన్న అధికారులు, నేతల మాటలు కార్యరూపం దాల్చడం లేదు. జలాశయం సమీపంలో పెద్దలు, పిల్లలకు కాలక్షేపానికి ఆట పరికరాలను ఏర్పాటు చేస్తే మేలనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

లీజుకు హరిత రిసార్టులు

కడెంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన హరిత రిసార్టుల్లో ఉన్న వివిధ గదుల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు సేద తీరేవారు. వచ్చిపోయే వారికి భోజనం అందించే అవకాశం ఉండేది. అయితే ఈ రిసార్టును బృందావన్ గార్డెన్స్ వారు లీజుకు తీసుకున్నారు. దీనిని మెరుగుపరిచి మరింత ఆకర్షణీయంగా ఇచ్చేలా హోటల్, వివిధ గదులను తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించి పనులు చేపడుతున్నారు. కడెం వచ్చే సందర్శకులకు మానసిక ఉల్లాసాన్నిచ్చేలా రిసార్టును అభివృద్ధి చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. అయితే రెండు నెలలుగా ఈ రిసార్టు మూసి ఉంది. త్వరగా వీటిని గదులను మెరుగుపరిచి అందుబాటులోకి తేవాలని పర్యాటకులు కోరుతున్నారు.




మూసి ఉన్న హరిత రిసార్టు

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో సంచలనం సృష్టించిన యూబిట్ కాయిన్ మల్టీలెవల్ మార్కెటింగ్‌లో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశామని జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. కడెం మండలం కన్నాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దాసరి రమేశ్, కుబీరు మండలం దౌజినాయక్ తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కీరం వెంకటేశ్‌గౌడ్‌లను పోలీసుల రిమాండ్ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇలాంటి వ్యవహారాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

కేంద్ర మంత్రులతో ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమైన ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్


పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ దిల్లీలో గురువారం కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఆయా సమస్యలను ప్రస్తావించారు. తొలుత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి జిల్లా కేంద్రంలో ఎయిర్‌ఫోర్సు ఏర్పాటు గురించి విన్నవించారు. రక్షణ శాఖకు ఇక్కడ 369 ఎకరాల భూమి ఉందని, అదనంగా 1592 ఎకరాల సేకరణకు జిల్లా అధికారులు భూమిని గుర్తించారని వివరించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సహకరించేందుకు సిద్ధంగా ఉందని చెప్పడంతో త్వరలో పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారని ఎంపీ తెలిపారు. అనంతరం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కలిసి మూతపడ్డ సీసీఐను తెరిపించాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ మంత్రి తమ ముందే మాట్లాడారన్నారు. త్వరలో కేంద్ర, రాష్ట్ర అధికారులతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారని వెల్లడించారు. జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్‌సింగ్ ఆర్యను కలిసి ఇటీవల జరిగిన జైనూర్ ఘటన పూర్వాపరాలను వివరించినట్లు తెలిపారు. ఆదివాసీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరినట్లు వివరించారు.

సిరికొండలో సామాజిక బహిష్కరణ

ఈటీవీ - ఆదిలాబాద్ : పగలు పట్టింపులు మానవత్వాన్ని మరిచిపోయేలా కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరించిన ఘటన ఒకటి ఆలస్యంగా వెలుగు చూసింది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో నివాసముండే దగ్గరి బంధువుల మధ్య ఒకప్పుడు ఎంతో సఖ్యత ఉండేది. అంతా దగ్గరి బంధువులే కావటంతో అవసరాల రీత్యా ఓ కుటుంబం రూ.2 లక్షలు అప్పు తీసుకొంది. తిరిగి చెల్లించడంలో జాప్యం కావటంతో మనస్పర్థలకు దారితీసింది. మాటామాటా పెరిగి కుటుంబాల మధ్య కలహానికి దారితీసింది. విషయం కుల పెద్దల పంచాయతీ వరకు వెళ్లింది. తీసుకున్న అప్పు తీర్చినా మనస్పర్థలు తొలగిపోలేదు. ఆలస్యంగా అప్పు చెల్లించిన కుటుంబాన్ని బహిష్కరించాలని సమీప బంధువులే నిర్ణయించారు. మిగిలిన బంధువులు కూడా వారి ఇంటికెళ్లొద్దని నిర్ణయించారు. బహిష్కరణకు గురైన బాధితుల కుటుంబంలో ఇటీవల ఓ పెద్దాయన కాలం చేశారు. సమీప బంధువులెవరూ రాలేదు. పాడెను ఎత్తుకోలేదు. మిగిలిన కుల, సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు సహకరించి అంత్యక్రియలు పూర్తిచేశారు. బంధువులంతా ఉండి అనాథలయ్యామంటూ బాధితుల్లో ఒకరు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఉద్యమాల ఊపిరి.. కొండా లక్ష్మణ్ బాపూజీ

● నేడు జయంతి



న్యూస్‌టుడే, వాంకిడి

స్వాతంత్రోద్యమం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ విముక్తి పోరాటం.. మూడు దశల ఉద్యమాల్లో పిడికిలెత్తి ప్రముఖ పాత్ర పోషించి దేశసేవకు అంకితమైన అలుపెరగని వీరుడు కొండాలక్ష్మణ్ బాపూజీ. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ లక్ష్యం చేరుకున్న సమయంలో దశాబ్దాల కల సాకారమైన వేళ స్వప్నాన్ని కళ్లారా చూడలేకపోయారు. ఓవైపు ఉద్యమాలే కాకుండా ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసి ప్రజాసేవలో రాణించారు. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేకం కథనం.

కుమురం భీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలో 1915 సెప్టెంబరు 27న అమ్మక్క-బాపూజీలకు నాలుగో సంతానంగా కొండా లక్ష్మణ్ జన్మించారు. న్యాయవాద విద్యనభ్యసించిన ఆయన నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ విముక్తి పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో ఆసిఫాబాద్ నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1967, 1972లో భువనగిరి నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 1957-60 వరకు రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, ముఖ్యమంత్రి సంజీవయ్య క్యాబినెట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. అనంతరం ముఖ్యమంత్రి బ్రహ్మానంద రెడ్డి క్యాబినెట్‌లో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

మలిదశలో ఉద్యమంలో..

2000లో మలి దశ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్‌తో మాట్లాడి ప్రోత్సహించడమే కాదు. సచివాలయం ఎదురుగా ఉన్న తన నివాసం జలదృశ్యాన్ని తెరాస ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. ఆ వేదికగానే తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) ఆవిర్భవించింది. అప్పటి నుంచి బాపూజీ అశోక్‌నగర్‌లోని అద్దె ఇంట్లో నివాసమున్నారు. తెలంగాణ సమరయోధులతో ఇందిరాపార్కు వద్ద, ఆ తర్వాత దిల్లీలోని జంతర్‌మంతర్‌లో సత్యాగ్రహం చేయడం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనం. ఎర్రటి ఎండలో తెలంగాణ రాష్ట్రమంతటా బస్సుయాత్ర చేపట్టారు. తెలంగాణ ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారు. 97ఏళ్ల వయసులో 2012 సెప్టెంబరు 21న ఆయన కన్నుమూశారు.




వాంకిడి వీధుల్లో ప్రజలతో బాపూజీ (పాత చిత్రం)

జన్మభూమి కోసం..

తాను పుట్టిన జన్మభూమి రుణం తీర్చుకునేందుకు 2010లో వాంకిడిలో 'లక్ష్మణ సేవాసదన్' స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అత్యవసర వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మహిళలకు కుట్టుశిక్షణ, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వాంకిడి మండల కేంద్రంలో తల్లిదండ్రుల స్మారకార్థం రెండు ముఖ ద్వారాలను నిర్మించారు.

ఇంధన్‌పల్లి రేంజిలో పెద్దపులి పాదముద్రల కలకలం

జన్నారం, న్యూస్‌టుడే: కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధి జన్నారం అటవీ డివిజన్ ఇంధన్‌పల్లి రేంజిలో పెద్దపులి పాదముద్రలు కలకలం రేపాయి. గురువారం చేపల వేటకు వెళ్లిన కొందరు ఆదివాసీ యువకులకు పులి పాదముద్రలు కనిపించడంతో చరవాణిలో ఈ చిత్రాలను బంధించారు. ఈ విషయమై ఇంధన్‌పల్లి రేంజి అధికారి హఫీసొద్దీన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పెద్దపులి సంచరిస్తోన్న మాట వాస్తవమేనని పశువులకాపరులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అయితే అటవీ ప్రాంతంలో అమర్చిన కెమెరాకు పులి చిక్కకపోవడంతో సందిగ్ధం నెలకొంది. అటవీ డివిజన్‌లోని కొన్ని బీట్లలో పెద్దపులి సంచరిస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ ఇటీవల దండోరా సైతం వేయించింది.



బురదలో కనిపిస్తున్న పులి పాదముద్ర

జైనథ్ ఆలయంలో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పూజలు

జైనథ్, న్యూస్‌టుడే : జైనథ్ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. మహిళలు, నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన ఆమె తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, కంది మౌనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద

పోలీసుల పరుగు.. మారథాన్ వైపు

● అధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ఆసక్తి

పరుగెత్తడం సులభమేమీ కాదు.. చాలా మంది ఒకటి, రెండు కిలోమీటర్లు పరుగు పెట్టేందుకు ఆయాస పడుతుంటారు. అలాంటిది ఏకంగా 21(హాఫ్ మారథాన్), 42(మారథాన్) కిలోమీటర్లు నిర్విరామంగా పరుగెత్తడమంటే నిరంతర సాధన, పట్టుదలతో సాధ్యమవుతోంది. ఇలాంటి పరుగును అవలీలగా పూర్తి చేస్తున్నారు రామగుండం కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పోలీసులు. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తి పొందుతూ అధికారి స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు పాల్గొంటూ మరింత మందికి ఆసక్తి పెంచుతున్నారు.

- న్యూస్‌టుడే, మంచిర్యాల క్రీడావిభాగం

ఎందరికో స్ఫూర్తి



రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐగా పనిచేస్తున్న కటికె రవిప్రసాద్ అందరికీ మారథాన్ రుచి చూపిస్తున్నారు. ఈయన ఇప్పటికే రెండు మారథన్‌లు, పదికిపైగా హాఫ్ మారథాన్‌లు పూర్తి చేసుకున్నారు. మొదట ఒక్కడిగా మొదలుపెట్టి ప్రస్తుతం పదుల సంఖ్యలో తోటి ఉద్యోగులతోపాటు స్నేహితులకు వ్యాప్తి చేశారు. రాష్ట్రంలో కాకుండా ముంబయి, గోవా తదితర ప్రాంతాల్లో నిర్వహించిన మారథాన్‌కు హాజరయ్యారు. ఈ పరుగుతో మరికొంతమందికి స్ఫూర్తినిస్తూ తను ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఇతరులను వ్యాయామంపై ఆసక్తి పెంచుకునేలా చేస్తున్నారు.



ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో ఔత్సాహికులు

హాఫ్ మారథాన్ అవలీలగా..



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సీఐగా పని చేస్తున్న గడిగొప్పుల సతీష్ హాఫ్ మారథాన్‌ను అవలీలగా చేసేస్తుంటారు. ఇటీవల తన మొదటి మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈయన 21 కిలోమీటర్లను మంచినీళ్లు తాగినంత సులువుగా పురుగెడతారు. దాదాపు 90-100 నిమిషాల వ్యవధిలో పూర్తి చేస్తారంటే ఏ స్థాయి వేగం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఏడాదిన్నర సాధనలో పదులకొద్ది హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నారు. ఇంకా వేగాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు.

నెమ్మదిగా ప్రారంభించి..



జిల్లా కేంద్రంలో ఇంటెలిజెన్స్ విభాగం ఎస్సైగా పనిచేస్తున్న రవికుమార్ ఏడాది కిందటి వరకు అయిదు కిలోమీటర్లే కష్టంగా పరుగెత్తేవారు. తోటి ఉద్యోగి స్ఫూర్తితో ఆఫ్ మారథన్‌లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. గతేడాది సిద్దిపేటలో నిర్వహించిన మొదటి మారథన్‌లో భాగస్వాములయ్యారు. ఇది కాస్త ఇబ్బందిగా పూర్తి చేయగా ఆ తర్వాత హైదరాబాద్, కరీంనగర్‌లో జరిగిన మారథన్ అవలీలగా పూర్తి చేశారు. ప్రస్తుతం రెండు గంటల్లో 21 కిలోమీటర్లు పరుగెత్తుతుండగా మారథన్‌లోనూ భాగస్వామి అయ్యేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఏడాది నుంచి..



జిల్లాలోని భీమారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న బేతి రాములు ఏడాది నుంచి పరుగుపై దృష్టి పెట్టారు. హాఫ్ మారథాన్‌లో పాల్గొనాలనే ఆసక్తితో నిత్యం సాధన చేయడం ప్రారంభించారు. మొదట 5, 10, 15 ఇలా వడివడిగా కిలోమీటర్ల సంఖ్యను పెంచుకుంటూ ప్రస్తుతం 21 కిలోమీటర్లను అవలీలగా పరుగెత్తుతున్నారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తన తొలి హాఫ్ మారథాన్‌న్ విజయవంతంగా రెండు గంటల్లో పూర్తి చేసుకున్నారు. 42 కిలో మీటర్లను సైతం ఇదేతీరుతో పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలతో..





వీరిద్దరు రామగుండం కమిషనరేట్‌లో పరిధిలోని ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ విభాగాల్లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు మాదాసి మధుకర్, రెడ్డిరాజుల తిరుపతి. ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటుంటారు. క్రమం తగ్గకుండా మైదానాన్ని వెళ్తుంటారు. పరుగు సాధన, అప్పుడప్పుడు ట్రెక్కింగ్ సైతం చేస్తుంటారు. తమ శాఖలోని అధికారులను స్ఫూర్తిగా తీసుకుని కొంతకాలంగా హాఫ్ మారథాన్‌కు సిద్ధమయ్యారు. కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మొదటిసారి హాజరై సునాయసంగా పూర్తిచేశారు. సాధనను కొనసాగిస్తూ మారథాన్‌కు సన్నద్ధమవుతామంటున్నారు.

నాలుగైదు నెలల్లోనే..



రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎస్‌బీ విభాగంలో ఎస్సైగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ తన మొదటి హాఫ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. ఇది వరకు 5, 6 కిలోమీటర్లకే పరిమితమయ్యేవారు. తోటి ఉద్యోగులు, మిత్రుల స్ఫూర్తి, ప్రోత్సాహంతో హాఫ్ మారథాన్‌వైపు అడుగులు వేశారు. కేవలం నాలుగైదు నెలల సాధనతో అవలీలగా పరుగుపెడుతున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా రెండు గంటల వ్యవధిలో పూర్తి చేస్తుండగా మరింత వేగం పెంచేందుకు సాధన చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 90309 25238
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 96031 04720
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్ :

? ఆదిలాబాద్ పట్టణంలోని 12వ వార్డు శ్రీనగర్ కాలనీలో మురుగు కాలువ లేక దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో టెండర్ నిర్వహించినా పనులు ప్రారంభించలేదు.

- లక్ష్మణ్ పవార్, శ్రీనగర్ కాలనీ

✔ నిధుల సమస్యతో మురుగు కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయి. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. **- తిరుపతి, డీఈఈ**

న్యూస్‌టుడే, తాంసి:

? తాంసి మండలం బండల్‌నాగాపూర్ నుంచి ఈదుల్లా సావర్‌గామ్ వరకు బీటీ రోడ్డు పనులు నెల రోజుల కిందట ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. **- సురం విశ్వేశ్వర్, సావర్‌గామ్**

✔ గుత్తేదారు నిర్లక్ష్యం వల్ల రహదారి నిర్మాణంలో కొంత ఆలస్యమైంది. వారం రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటా.

- శివరాం, పంచాయతీరాజ్ డీఈ

రుణ బకాయిలు వసూలు చేయండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : స్త్రీనిధి పథకం కింద రుణాలు తీసుకున్న మహిళా స్వయం సహాయక సంఘాల నుంచి శతశాతం బకాయిలు వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో సెర్ప్, మెప్మా, స్త్రీనిధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. డీఆర్డీఓ సాయన్న, మెప్మా పీడీ మమత, స్త్రీనిధి జోనల్ మేనేజర్ రవికుమార్, ఆర్ఎం పూర్ణచందర్, విజయ డెయిరీ డీడీ మధుసూదన్, డీపీఎం కిషన్, డీపీఎం గంగన్న, శేఖర్, నరేందర్, హేమలత, శోభారాణి, సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షురాలు వనజ, ప్రమీల, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పాల్గొన్న అధికారులు

కలెక్టర్‌కు వినతి

సొనాల(బోథ్): తమ గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలని బోథ్ మండలం టివిటి గ్రామస్థులు కలెక్టర్ రాజర్షిషాకు ఆదిలాబాద్‌లో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు.

అత్తపై కొడవలితో అల్లుడి దాడి

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : భార్యను పంపించడం లేదన్న కోపంతో అత్తపై కొడవలితో అల్లుడు దాడి చేసిన ఘటన వెలుగు చూసింది. రెండో పట్టణ సీఐ కరుణాకర్‌రావు వివరాల మేరకు.. మహారాష్ట్రలోని కిన్వట్ గ్రామానికి చెందిన సప్న(26) భర్తతో గొడవ పడి సుందరయ్యనగర్‌లో ఉండే తల్లి గారింటికి వచ్చింది. ఆమెను తీసుకెళ్లడానికి భర్త పునీత్ ఇక్కడికి వచ్చాడు. పెద్ద మనుషులను తీసుకొచ్చి పంపిస్తానని అత్త రేఖ చెప్పటంతో కోపోద్రిక్తుడైన పునీత్ ఆమెపై కొడవలితో దాడి చేశాడు. రేఖను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. ఇదిలా ఉండగా అనంతరం పునీత్ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఇద్దరికీ గాయాలు కాగా రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రేమ పేరిట మోసం : కేసు నమోదు

తలమడుగు, న్యూస్‌టుడే : ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తిపై తలమడుగు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. బాధిత యువతి రిమ్స్‌లో నాలుగు రోజుల కిందట మగబిడ్డకు జన్మనిచ్చింది. ఎస్సై అంజమ్మ వివరాల ప్రకారం.. తలమడుగు మండలం ఓ గ్రామానికి యువతిని, అదే గ్రామానికి చెందిన యువకుడు రెండేళ్లుగా ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాడు. బాధితురాలు ఇటీవల మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడు నీతో నాకు సంబంధం లేదని మాట మార్చడంతో యువతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి పాముకాటు.. రిమ్స్‌కు తరలింపు

జైనథ్, న్యూస్‌టుడే : లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లింగన్న(40) గురువారం ఉదయం పొలంలో పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 వాహన పైలెట్ సాయికిరణ్, ఈఎంటీ కార్తిక్‌సింగ్‌లు ప్రథమ చికిత్స అందించి రిమ్స్‌కు తరలించారు.

గ్రామీణులకు సురక్షిత నీరు అందించండి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామస్థులకు సురక్షిత నీటిని అందించడంతో పాటు నీటి వృథాను అరికట్టాలని జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి మంచి నీటి సరఫరా సహాయకులకు సూచించారు. గురువారం ఆదిలాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారికి శిక్షణ పత్రాలను పంపిణీ చేశారు. జిల్లా మిషన్ భగీరథ అధికారి సురేష్, ఎంపీడీవో నాగేశ్వర్, ఏఈ ఆదిత్య, పాల్గొన్నారు.

ఇచ్చోడ: తాగు నీటి సరాఫరాలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మిషన్ భగీరథ ఈఈ చంద్రమోహన్ అన్నారు. ఇచ్చోడలో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీటి నాణ్యత నిపుణులు తిరుపతి ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ లక్ష్మణ్, ఏఈఈ జైపాల్, తదితరులు ఉన్నారు.



ఆరుబయటే భోజనం చేస్తున్న కేస్లాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల బాలికలు



ఇంద్రవెల్లి ఆశ్రమ పాఠశాలలో వర్షంలోనే మధ్యాహ్న భోజనం కోసం బారులు తీరిన బాలికలు

ఎండైనా.. వానైనా.. వేదనే!

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ విద్యార్థులకు భోజనశాల లేక ఆరు బయటే భోజనాలు చేస్తున్నారు. ఇక్కడ 507 మంది బాలికలు చదువుతున్నారు. వారంతా పాఠశాల ఆవరణలో కింద కూర్చొని భోజనాలు చేస్తున్నారు. గాలి వీస్తే దుమ్ము సైతం భోజనం ప్లేటులో పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంద్రవెల్లి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలోనూ భోజనశాల లేదు. ఈ పాఠశాలలో 530 మంది విద్యార్థులు చదువుతున్నారు. వానొస్తే తడుచుకుంటూనే భోజనం కోసం వరుసలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. సమస్యను అధికారులు పట్టించుకొని భోజనశాల నిర్మించాలని వేడుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

ఖానాపూర్ చెరువు ఆక్రమణలపై సర్వే

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ఖానాపూర్ చెరువులో ఆక్రమణలపై అధికారుల సర్వే ప్రారంభమైంది. చెరువు స్థలాల ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో ఇటీవల జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు బల్దియా, నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు గురువారం ఖానాపూర్ చెరువు పరిధిలో వెలిసిన నివాసాల వద్దకు చేరుకున్నారు. ప్రభావిత నివాస గృహాలకు మార్కింగ్ చేశారు. అక్కడ ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న వారు ఆందోళన చెందగా వారిని సముదాయించారు. ఖానాపూర్ చెరువు పూర్తినీటి మట్టం ఉన్న ప్రాంతంలో నివాసాలు ఎన్ని ఉన్నాయని సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఇప్పుడే నివాసాలను కూల్చబోమని స్పష్టం చేశారు. సర్వే కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని బల్దియా కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ పేర్కొన్నారు. త్వరలోనే సర్వే పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. నీటి పారుదల శాఖ డీఈ ప్రేమ్‌సింగ్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



బల్దియా, నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారుల సమక్షంలో నివాసాలకు మార్కింగ్ చేస్తున్న సిబ్బంది

ఐద్వా నూతన కార్యవర్గం ఎన్నిక

ఎదులాపురం, న్యూస్‌టుడే : జిల్లా ఐద్వా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు కోవె శకుంతల వెల్లడించారు. సుందరయ్యభవన్‌లో నూతన కమిటీ వివరాలను ఆమె వెల్లడించారు. జిల్లా కార్యదర్శిగా జమున, సహాయ కార్యదర్శిగా ప్రభావతి, ఉపాధ్యక్షురాలిగా విజయ, కోశాధికారిగా మంజుల, సభ్యులుగా లలిత, పంచపూల, పల్లవి, రఫీక, ఇందుబాయి, పొచ్చక్క ఎన్నికయ్యారు.



కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆందోళన

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలం అర్లి-బి పంచాయతీ నిషాన్‌ఘాట్‌లో విద్యుత్తు సరఫరాతో పాటు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవి వచ్చి వినతిపత్రం స్వీకరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు నళినిరెడ్డి, అరుణ్‌కుమార్, కుంటాల రాములు, అమీనా బేగం, కృష్ణవేణి, సంగీత, పుష్ప, రాందాస్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ తెలిపారు.

ఘనంగా వీరనారి ఐలమ్మ జయంతి

ఆదిలాబాద్ అర్బన్, ఉట్నూరు గ్రామీణం, ఇచ్చోడ, బోథ్, జైనథ్, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, తాంసి, న్యూస్‌టుడే : తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ద్విచక్రవాహన ర్యాలీలు నిర్వహించారు. ఆమె పోరాట స్ఫూర్తి ఈ తరానికి ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు.



ఉట్నూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రజక, బీసీ సంఘం నాయకులు



ఇచ్చోడలో..



బోథ్‌లో..



కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, గజేందర్, శ్రీకాంత్‌రెడ్డి

గోండి లిపిని భద్రపర్చడం గర్వకారణం

నార్నూర్, న్యూస్‌టుడే : మండలంలోని గుంజాల గ్రామంలో గోండి లిపి భాషా పుస్తకాలను తయారు చేసి భద్రపరిచి సమాజాన్ని చైతన్యపర్చడం గర్వకారణమని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. గురువారం ఆమె గ్రామాన్ని సందర్శించి ఇటీవల మృతిచెందిన గోండి లిపి పండితుడు కోట్నాక్ జంగు, మూడేళ్ల కిందట చనిపోయిన అర్క జైవంత్‌రావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదివాసీల గోండి లిపిని తయారు చేయడం గొప్పతనమన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి ప్రత్యేక కృషి చేస్తామన్నారు. ఆత్రం భాస్కర్, అర్క మాణిక్‌రావు, అర్క వసంత్‌రావు, సార్‌మేడీ కోట్నాక్ కృష్ణ, కోట్నాక్ వినాయక్‌రావు, తదితరులున్నారు.



కొట్నాక్ జంగు, అర్క జైవంత్‌రావు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

త్వరలోనే ఆదివాసీ పెద్దలతో సీఎం సమావేశం

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : త్వరలోనే ఆదివాసీ పెద్దలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించి మాట్లాడతారని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. గురువారం ఉట్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గవర్నర్ జిల్లాలో పర్యటిస్తానని మాటిచ్చారని తెలిపారు. ఇరు వర్గాల ప్రజలు సంయమనం పాటించాలని కోరారు. ఏజెన్సీలో శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బాధితురాలితో మంత్రి సీతక్క ప్రతి రోజు మాట్లాడుతున్నారన్నారు.



సమీక్షలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, అధికారులు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఉట్నూరు గ్రామీణం: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం ఉట్నూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రతి జైలులో మానసిక వైద్య నిపుణుడిని నియమిస్తాం

ఎదులాపురం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రతి జైలులో మానసిక వైద్య నిపుణులను నియమించే ఏర్పాట్లు చేస్తామని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జిల్లాకు రెండు రోజుల పర్యటన కోసం గురువారం వచ్చిన రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. జిల్లా జైలును కలెక్టర్ రాజర్షిషాతో కలిసి సందర్శించారు. జైలులో బ్యారక్‌లు, వంటశాల, ఖైదీల కోసం తయారు చేసిన వంటకాలను పరిశీలించారు. మహిళా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జైలు నిర్వహణ బాగుందని ఆమె కితాబిచ్చారు. పర్యవేక్షణాధికారి అశోక్‌కుమార్, జైలర్ సూర్యప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన, మలేరియా అధికారి ఎం.శ్రీధర్ తదితరులున్నారు.



జైలులో వంటలను పరిశీలిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద

చట్టాలపై అవగాహన కల్పించండి

పాలనాప్రాంగణం: ప్రజల్లో చట్టాలపై విస్తృత అవగాహన కల్పిస్తేనే నేరాలు చేస్తే శిక్షలు ఉంటాయనే విషయం తెలిసి తప్పులు చేయకుండా ఉంటారని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద పేర్కొన్నారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆమె నాలుగు జిల్లాల అధికారులతో ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు.

పీఆర్‌టీయూలో ఎన్నికల వేడి

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : అత్యధిక సభ్యులు ఉన్న ఉపాధ్యాయ సంఘంగా పేరొందిన ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ)లో ఎన్నికల వేడి రాజుకుంది. మూడేళ్ల కాలానికి జిల్లా కార్యవర్గం ఎన్నిక ఈ నెల 29న సంఘ భవనం వేదికగా జరగనుంది. ఈ నేపథ్యంలో కీలకమైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు రెండు ప్యానళ్ల నడుమ హోరాహోరీ పోరు కనిపిస్తోంది. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 1,642 మంది ఉపాధ్యాయులు సభ్యత్వం కలిగి ఉన్నట్లు సంఘ సభ్యులు చెబుతున్నారు. మండల కార్యవర్గాల్లోని అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఇతర సభ్యులు కలుపుకొని మొత్తం 99 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇప్పటికే మండల కార్యవర్గాలను తమకు అనుకూలురైన వారిని ఎన్నుకున్న ఆయా ప్యానళ్ల వారు ఎవరికి వారు తమదే గెలుపంటూ ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. ఇది వరకు జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన కొమ్ము కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్‌రెడ్డిలు వేర్వేరు ప్యానల్‌లుగా ఏర్పడి అధ్యక్ష స్థానానికి పోటీపడుతుండగా.. ప్రధాన కార్యదర్శులుగా కుంబోజి సూర్యకాంత్, టి.నర్సింహస్వామి రంగంలోకి దిగారు. మొత్తం ఓటర్లలో 26 మంది మహిళలు ఉండటంతో వారి ఓట్లు కీలకంగా మారాయి. పురుష ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు మందు, విందులతో ప్రత్యేక శిబిరాలనే నిర్వహిస్తుండటం పోటీ తీవ్రతకు అద్దం పడుతోంది.



కుడాల రవీందర్



కొమ్ము కృష్ణకుమార్

విపత్తు నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

జైనథ్, న్యూస్‌టుడే : విపత్తు నిర్వహణపై జైనథ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు టీడీఆర్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ప్రకృతి, మానవుల ద్వారా కలిగే విపత్తులను ఆ సంస్థ నిపుణులు సాగర్, జిలానీలు విద్యార్థులకు తెలియజేశారు. అకస్మాత్తుగా ఎవరైనా కుప్పకూలితే సీపీఆర్ ఎలా చేస్తారో తెలిపి వాటిని విద్యార్థులతో అభ్యాసం చేయించారు. పాఠశాల ప్రిన్సిపల్ రాము, ఉపాధ్యాయులు శ్రీధర్, తారాచంద్, అలీముద్దీన్, సతీష్, పాటిల్ వినోద్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై తక్షణ స్పందన అవసరం

ఆదిలాబాద్ నేర విభాగం: ఎక్కడైనా శాంతి, భద్రతల సమస్య తలెత్తినప్పుడు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం పోలీసు అధికారులకు సూచించారు. స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్‌లో గురువారం ఆయన నేర సమీక్ష నిర్వహించి పోలీసులకు పలు సూచనలు చేశారు. గంజాయి, మాదకద్రవ్యాలు, చోరీలపై దృష్టిసారించాలన్నారు. ఏఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్, బి.సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ గ్రేడ్-1 అదనపు పీపీగా ఉపేందర్

ఎదులాపురం: సికింద్రాబాద్‌లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-1గా పని చేస్తున్న ఆర్.ఉపేందర్ ఆదిలాబాద్ ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-1గా బదిలీ అయ్యారు. ఆదిలాబాద్ అడిషనల్ సబ్ జూనియర్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-2గా విధులు నిర్వహిస్తున్న ఈ.కిరణ్‌కుమార్‌రెడ్డికి పదోన్నతి కల్పిస్తూ మహబూబ్‌నగర్ సెషన్స్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-1గా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం/డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది.

ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

బేల: బేల మండల విద్యాధికారిగా కోల నర్సిములు నియమితులయ్యారు. ఇది వరకు ఎంఈఓగా పని చేసిన శ్రీనివాస్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

బోథ్: బోథ్ ఎంఈవోగా కన్గుట్ట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇదాపు పోశెట్టి గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు చేపట్టారు.

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్ మండల విద్యాశాఖ అధికారిగా పిప్పిరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కిషన్ గుప్త బాధ్యతలు స్వీకరించారు.

ఉట్నూరు గ్రామీణం: ఉట్నూరు మండల విద్యాధికారిగా రాపెల్లి ఆశన్న పదవీ బాధ్యతలు తీసుకున్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

భీంపూర్: మండల కాంగ్రెస్ నాయకులు గురువారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ, పిప్పల్‌కోటి నిర్వాసితులకు పరిహారం విడుదల చేయాలని కోరినట్లు నేతలు తెలిపారు. నాయకులు దాసరి రమేష్, శ్రీనివాసరెడ్డి, మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్, ప్రవీణ్ ఉన్నారు.

ఆసుపత్రుల్లో కార్మికుల సంఖ్య పెంచాలి

ఎదులాపురం: ప్రస్తుతం డెంగీ, వైరల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహతో కలిసి హైదరాబాద్‌లో డీఎంఈకి వినతి పత్రాన్ని అందజేశారు.

పోస్టుమాస్టర్‌కు సన్మానం

గుడిహత్నూర్: గుడిహత్నూర్ మండల సబ్ పోస్టు మాస్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌ను వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, నాయకులు బాలాజీ, జంగు, మంగనాలే బాలాజీ పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

తలమడుగు: సహకార సంఘాల బలోపేతానికి సంఘ సభ్యులు కృషి చేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం తలమడుగులోని సంఘ కార్యాలయంలో మహాజన సమావేశం నిర్వహించారు. సీఈవో మోతే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పద్మాకర్‌రెడ్డి, డైరెక్టర్లు గంగారాం, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, సిబ్బంది సాగర్, సత్యనారాయణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

28న అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్

ఎదులాపురం: ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి బొనగిరి సౌజన్య వెల్లడించారు. గురువారం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రాజీపడదగ్గ కేసులన్నీ కక్షిదారులు పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలన్నారు.

కఠినంగా శిక్షించాలి

ఎదులాపురం: మహిళలపై తరచూ జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు సాగిస్తామని ఆదివాసీ భారత్ మహాసభ అనుబంధ మహిళా సంఘర్షణ సమితి అధ్యక్షురాలు కుమ్ర పద్మ ప్రకటించారు. గురువారం ఆమె కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడుతూ మహిళలను వేధించేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొత్తగా ఏర్పాటైన కార్యవర్గాన్ని ఆమె వెల్లడించారు. అధ్యక్షురాలిగా కుమ్ర పద్మ, ప్రధాన కార్యదర్శిగా కాంతబాయి, కోశాధికారిగా టర్పె తులసీ, సభ్యులుగా శిరీష, లక్ష్మీ, సుశీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



ఓటు వేసేందుకు బ్యాలెట్ పత్రం తీసుకుంటున్న విద్యార్థిని

ఎన్నికలపై అవగాహన

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎన్నికలపై అవగాహన కల్పించారు. కెప్టెన్, వైస్ కెప్టెన్‌లను ఓట్లు వేసి ఎన్నుకున్నారు. నిజమైన ఎన్నికల మాదిరే వారికి బ్యాలెట్ బాక్సు ద్వారా ఎన్నిక నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జాదవ్ పూల్‌చంద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిర్ధారణ పరీక్షల నాణ్యతపై దృష్టి పెట్టాలి

ఆదిలాబాద్ వైద్య విభాగం: రిమ్స్‌లోని టీబీ కల్చర్, డీఎస్టీ ల్యాబ్‌లను చెన్నై నుంచి వచ్చిన కేంద్ర బృందం గురువారం తనిఖీ చేసింది. ఆ బృందం సభ్యులు అజ్గర్, రాజేశ్వరీ, దినేష్, రాధిక, సుధాకర్, నల్ల పెరుమళ్ల తనిఖీలు నిర్వహించారు. వారు స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా క్షయ నివారణాధికారి సుమలత, సిబ్బంది ప్రమోద్ తదితరులున్నారు.

శ్రీరామరథ నిర్మాణానికి విరాళం అందజేత

సొనాల(బోథ్): సొనాల రామాలయంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల రథ నిర్మాణానికి ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.వి.రమణ రూ.50,000 విరాళం, గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య రూ.20,000 విరాళం ప్రకటించారు.

మహిళలకు బహుమతులు



మహిళలకు బహుమతులు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించేలా వంటలు చేసిన మహిళలకు పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం కిరీటాలు పెట్టి బహుమతులను అందజేశారు. పోషణ మాసంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్త రాధ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రదర్శన, వంటల పోటీలను నిర్వహించారు. పోషకాలున్న వంటలు చేసిన సునీత, కళ్యాణి, మరో ఆరుగురిని ఆర్గానిక్ మహిళలుగా ఎంపిక చేశారు. ఖుర్శిద్‌నగర్ పీహెచ్‌సీ ఏఎన్ఎం పుష్ప, ఆర్పీ ఫరీదా, కాలనీ మహిళలు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, ఎదులాపురం**